కాంగ్రెస్‌పైనే ప్రజల నమ్మకం

కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్



ఇంటర్వ్యూ

మణికొండ: పేద ప్రజలకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను అందించిన గత చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఈసారి ఎన్నికల్లో వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండుసార్లు బీఆర్ఎస్ పార్టీ ప్రజలను ఊరించి మోసం చేసిందని, దీంతో ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తనకి ఎందుకు ఓటు వేయాలని 'సాక్షి' వేసిన ప్రశ్నకు సమాధానంగా నరేందర్ జవాబు ఇచ్చారు. మరిన్ని ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

ప్రశ్న : ఎన్నికల ప్రచారంలో ప్రజల ఆదరణ ఎలా ఉంది..?

జవాబు: చాలా బాగుంది. గత దశాబ్దకాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో మోసపోయిన వారంతా స్వచ్ఛందంగా వచ్చి తనకు మద్దతు తెలుపుతున్నారు. వారి అండతోనే రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తాను.

ప్రశ్న : కర్ణాటకలో ఇచ్చిన హామీలు అమలు కావటం లేదని, ఇక్కడా అమలు చేయరని ఇతర పార్టీల నాయకుల విమర్శలపై మీ అభిప్రాయం..?

జవాబు: అవి ఆరోపణలు మాత్రమే. అమలు అక్కడికి వెళ్లిన వారికి తెలుస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోపు హామీలను అమలు చేస్తామన్నారు. ఇప్పటికే మెజార్టీ హామీలను నెరవేర్చారు. మిగతావి నెరవేర్చుతారు. ఇక్కడ అలాంటి సమస్య రాకుండా అన్ని హామీలను మొదటి కేబినెట్ సమావేశంలోనే తీర్మాణం చేసి అమలు చేసే దిశగా ఆలోచన చేస్తున్నాం.

ప్రశ్న : మీ రాజకీయ నేపథ్యం ఏమిటి..?

జవాబు: మూడు దశాబ్దాలుగా మా అన్న, నేను, నా భార్య పుప్పాల్‌గూడ గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశాం. ప్రస్తుతం మణికొండ మున్సిపాలిటీ చైర్మన్‌గా ఉన్నాను. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తాను ముందుంటాను.

ప్రశ్న : మీరు ఎన్నికల్లో ఇచ్చే హామీలు ఏమిటి ?

జవాబు: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రతి ఐదేళ్లకు జనాభా రెండితలవుతోంది. దీంతో సమస్యలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు స్థానిక నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను రాబట్టి అన్ని రకాల మౌళిక సదుపాయాలను కల్పించేందుకు కార్యాచరణతో పనిచేస్తా.

ప్రశ్న : మీరు గుర్తించిన ప్రధాన సమస్యలు ఏమిటి..?

జవాబు: శంషాబాద్ మండలంలో ప్రతి గ్రామంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి. కాటేదాన్‌లో కార్మికుల శ్రేయస్సు కోసం ఈఎస్ఐ ఆసుపత్రి, ఫైర్ స్టేషన్, ప్రతి కాలనీలో కమ్యూనిటీ హాల్, యువకులకు ఆట స్థలాలు, ప్రతి మున్సిపాలిటీకి జూనియర్ కళాశాల, పార్కులు, మార్కెట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అవకాశమిస్తే అసెంబ్లీలో గళం వినిపిస్తా !

బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి



ఇంటర్వ్యూ

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. రెండు పర్యాయాలు ఆయన కార్పొరేటర్‌గా గెలిచారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ.. గెలిస్తే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గొంతుకను అవుతానన్నారు.

ప్రశ్న: ప్రచారం ఏవిధంగా జరుగుతోంది?

జవాబు: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. యువకులు, మహిళలు ఆదరిస్తున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. డివిజన్ ప్రజలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, అపార్ట్‌మెంట్ వాసులు నా గెలుపు కోసం ముందుంటామని అంటున్నారు.

ప్రశ్న: మీ కుటుంబ రాజకీయ నేపథ్యం ఏమిటి?

జవాబు: మా తండ్రిగారికి గత 20 ఏళ్లుగా రాజకీయం అనుభవం ఉంది. ఆయన ప్రోత్సలంతోనే రాజకీయాల్లోకి వచ్చాను. ఇప్పటికి నా వెన్నంటే ఉంటున్నారు. ఆయన సలహాలతోనే రాజకీయాలలో చిన్న వయస్సులోనే కార్పొరేటర్‌గా రెండు సార్లు విజయం సాధించాను.

ప్రశ్న: ఎన్నికల్లో మీరు ప్రజలకు ఇచ్చే హామీలేమిటి?

జవాబు: ప్రజలకు మంచి పాలనతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను. ముఖ్యంగా రోడ్లు డ్రైనేజీలపై దృష్టి సారించి ఏ కాలనీలోకి వెళ్లిన మెరుగైన రోడ్లు వేసి ప్రజలకు ఇస్తాను. పేద వారు నివసిస్తున్న కాలనీలలో మురుగు నీరు రోడ్లపై పారకుండా చూస్తాను. వారికి అన్ని రకాల విద్య, వైద్యం అందిస్తాను. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా చూస్తాను. నా జీవితం ప్రజాసేవకే అంకితం చేస్తాను.

ప్రశ్న: మీపై కూడా ఆరోపణలు ఉన్నాయి. వీటిపై మీ సమాధానం ?

జవాబు: నేను రాజకీయాల్లోకి వచ్చింది డబ్బు సంపాదించుకోవడానికి రాలేదు. ప్రజల సేవ చేయడానికే వచ్చాను. ఎక్కడైన భూ కబ్జాలు కాని బెదిరింపులు కాని ఎప్పుడు చేయలేదు. నిస్వార్థంగా వచ్చిన వారికి కాదనకుండా సహాయం చేస్తున్నాను. కొందరు గిట్టనివారు నా ఎదుగుదల చూసి ఆరోపణలు చేస్తే నాకు ఎలాంటి నష్టం వాటిల్లదు. ప్రజల అండ నాకు ఉంది. రాజకీయంలోకి రాక ముందు నుండి మా వ్యాపారంలో సంపాదించుకున్నాం.

ప్రశ్న: నియోజకవర్గంలో మీరు గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారం కోసం ఏం చేస్తారు ?

జవాబు: రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఐదేళ్లు ప్రకాష్‌గౌడ్ చేయలేని అనేక సమస్యలను పరిష్కరిస్తా.. రాజేంద్రనగర్‌లో అభివృద్ధి చేయాల్సింది చాలా ఉంది. యువతకు ఉపాధి, అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి కావాల్సిన ప్రణాళికను రూపొందిస్తాను. ప్రజలు పడుతున్న ముఖ్యమైన సమస్యలు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలపై దృష్టిసారిస్తాను. మెరుగైన పాలనను అందిస్తాను.

ప్రశ్న: మీకే ఓటు ఎందుకు వేయాలి?

జవాబు: నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటువేస్తే అభివృద్ధి చేయలేరు. అభివృద్ధి జరగాలంటే విద్యావంతులకే ఓటు వేయాలి. ప్రజలకు తెలుసు విద్యావంతుడికి ఓటువేస్తే అనేక నిధులు తీసుకురాగల సత్తా ఉంటుందని. అసెంబ్లీలో బల్ల గుద్ది మాట్లాడే సత్తా కలవాడిని కాబట్టి. ఇప్పటికే నిధుల కోసం జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో మేయర్‌ను నిలదీస్తున్నది ప్రజలు చూస్తున్నారు. ఎమ్మెల్యేగా అవకాశం వస్తే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై నిలదీసే సత్తాగల యువకుడని నియోజకవర్గం ప్రజలకు తెలుసు కాబట్టి ఓటు వేసి గెలిపిస్తారు.

జంగ్ తెలంగాణ 2023

బీఆర్ఎస్‌కు కార్యకర్తల ప్రచారం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా కార్యకర్తలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం మార్కండేయనగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోట పవన్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మహిళలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ బ్యాలెట్ నెం. 3 కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే మార్కండేయనగర్‌లోని అన్ని రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు వేయిస్తాడని ప్రజలకు తెలిపారు. కోట పవన్, గంజి విజయ్, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీజేపీ గెలుపు రాజేంద్రనగర్ మలుపు'

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీ గెలుపు రాజేంద్రనగర్ మలుపు అని బీజేపీ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు జోగి రవి ఆధ్వర్యంలో గగన్ పహాడ్ పరిసర బస్తీలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందని, కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. యువ సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రజలు మార్పుకోరుకుంటున్నారని, విద్యావంతుడైన తోకల శ్రీనివాస్‌రెడ్డికి ఓటువేసి బీజేపీని అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ సూరెడ్డి వినయ్‌రెడ్డి, శ్రీనివాస్, తలారి చిన్నా, నందు, నాగేష్, క్రిష్ణ, సాయి తదితరులున్నారు.

'తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్'

అత్తాపూర్: తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రాబోతుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఉమామహేశ్వరిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సర్కార్ పాలనపై ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో రగిలిపోతున్నారని ఆమె పేర్కొన్నారు. సోమవారం ఆమె రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డితో అత్తాపూర్‌లోని పలు కాలనీల్లో విస్తృత్తంగా పర్యటించారు. మహిళా, మైనార్టీ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో మైనార్టీ మహిళలకు జరిగిన మేలును ప్రస్తావిస్తూ.. వారి ఓట్లను అభ్యర్థించారు. మైనార్టీ మహిళలకు మేలు చేసేందుకు వారికి సామాజిక భద్రతను కల్పించేందుకు అనేక విధానాలను బీజేపీ వద్ద అనేక ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. తమ అభ్యర్థి యువకుడు, ఉత్సాహవంతుడు, పూర్తిస్థాయి రాజకీయ కార్యకర్త అని, అందరికీ అన్ని వేళలో అందుబాటులో ఉంటాడని హామీనిస్తూ.. ప్రచారాన్ని కొనసాగించారు.

సేవ చేయడానికే రాజకీయాల్లోకి..

రాజేంద్రనగర్: ప్రజలకు సేవచేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని రాజేంద్రనగర్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి (రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా అధ్యక్షురాలు) హేమ అన్నారు. సోమవారం పర్మారెడ్డి హిల్స్‌లోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఓటర్లు తమకు సేవచేసే వారిని గుర్తించి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఉచిత విద్య, వైద్యం ప్రజలకు ఎంతో అవసరమని, అదే తన నినాదం అని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, పిల్లలకు ఉచిత విద్య, రోగులకు ఉచిత వైద్యం అందించడం ఎంతో అవసరమని వెల్లడించారు. ఆమ్‌ఆద్మీపార్టీ నుంచి స్పష్టత రాకపోవడంతోనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నానన్నారు. పార్టీ నాయకులు శివ శంకర్, విష్ణు ప్రియ, శ్రీకాంత్, యమునా గౌడ్, సుధాకర్, రామ్‌గౌడ్, ప్రణయ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు

మణికొండ: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలనే మద్దతు మరింత పెరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ గండిపేట మండల సమన్వయకర్త తలారి మల్లేష్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డిలు అన్నారు. సోమవారం వారి ఆధ్వర్యంలో పుప్పాలగూడ పాషాకాలనీ, కిజ్రాకాలనీ, కూలీ కుద్బుద్దీన్ కాలనీ, హ్యాపీ హోమ్స్ కాలనీలకు చెందిన ముస్లింలు బీఆర్ఎస్‌లో చేరారు. పిలిస్తే పలికే నాయకుడిగా, ప్రజలందరి మేలు కోరే ప్రజాప్రతినిధిగా, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడిగా ప్రకాష్‌గౌడ్ నిలవడంతో ఆయనకు మద్దతు పలికి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ తరలివస్తున్నారన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పాలన



భారీ గజమాలతో సత్కరించి గదను బహుకరించిన కౌన్సిలర్ వై. కుమార్



హైదర్షాకోట్‌లో ఇంటింటి ప్రచారంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

శంషాబాద్ : సంక్షేమ పాలన బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ అన్నారు. మూడుసార్లు గెలిపించిన ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించి అభివృద్ధి మరింత జరిగేలా చూడాలని ఆయన కోరారు. పట్టణంలోని కాపుగడ్డ, రుద్రాకాలనీ, యాదవబస్తీ, సిద్ధప్పరోడ్డు, మక్తా, అహ్మద్‌నగర్, పోచమ్మగడ్డ తదితర బస్తీల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌తో కలిసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటి గడపకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కౌన్సిలర్లు వై.కుమార్, జహంగీర్‌ఖాన్‌లు భారీ గజమాలతో ఎమ్మెల్యే రోడ్‌షోకు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, స్థానిక కౌన్సిలర్లు విజయలక్ష్మి, అజయ్, నాయకులు మురళి తదితరులున్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం..

బండ్లగూడ: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలంతా మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ

• బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్

ఎన్నికల ప్రచారాన్ని జోరుగా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభివృద్ధి చేశారని అభిప్రాయపడ్డారు. మరోసారి అవకాశమిస్తే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారన్నారు. ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

కోకాపేట్‌లో కౌన్సిలర్ ప్రచారం..

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి నాల్గోసారి ఎమ్మెల్యేగా ప్రకాష్‌గౌడ్ భారీ మెజార్టీతో గెలవడం తథ్యమని, ప్రజలు పెద్దఎత్తున ఓటువేసి గెలిపించాలని కోకాపేట కౌన్సిలర్ శివారెడ్డి కోరారు. సోమవారం ఆయన తన వార్డు పరిధిలోని రాజీవ్ గృహకల్పలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సంక్షేమ పథకాలు, హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. వారంతా మరోసారి ఎమ్మెల్యేగా ప్రకాష్‌గౌడ్, సీఎంగా కేసీఆర్‌ను ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయని వారికి బై..బై చెప్పండి!

బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి





గొల్లపల్లి ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న తోకల, ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

శంషాబాద్ : 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి ఒక్క సమస్యను కూడా పరిష్కరించని ఎమ్మెల్యేను సాగనంపాల్సిన సమయం మరికొద్ది గంటల్లోనే ఉందని, ఆయనకు ఇక బై.. బై చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలు మూడుసార్లు గెలిపించినా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. పట్టణంలోని గొల్లపల్లి, తొండుపల్లి, ఊటీపల్లిలో తోకల చేపట్టిన రోడ్‌షోకు విశేష స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ.. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే స్థలం ఒక్కటి కూడా ఉండదన్నారు. కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చింతల నందకిశోర్ గుప్తా, కౌన్సిలర్ కె. ప్రవీణ్‌గౌడ్, దేవేందర్, మహిపాల్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో..

రాజేంద్రనగర్: శివరాంపల్లి న్యూ వీకర్ సెక్షన్ కాలనీలో సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డికి కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నాయకులు హరికిషన్‌జీ, ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామ్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, రాజేశ్వర్ తదితరులున్నారు.

పేదలకు లబ్ధి చేకూరేలా బీఆర్ఎస్ మేనిఫెస్టో !

మైలార్‌దేవ్‌పల్లి : పేదలకు మరింత లబ్ధి చేకూరేలా బీఆర్ఎస్ మేనిఫెస్టోను రూపొందించారని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పి.ఎల్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం దుర్గానగర్‌లోని కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి కోసం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఇతర పార్టీలు వారంటీ లేని పథకాలు తీసుకొచ్చినా.. ప్రజలు నమ్మరని అభిప్రాయపడ్డారు. కాటేదాన్ ప్రాంతంలో అనేక ఇబ్బందులు పడుతున్న పరిశ్రమలకు 24 గంటల పాటు కరెంటు ఇచ్చి ప్రజలకు నిత్యం పని కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, మురుగు సమస్య లేకుండా అనేక నిధులు మంజూరా చేసి ప్రజా సమస్యలను తీర్చాడన్నారు. మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్, మనోహర్‌గౌడ్, అడియాల మహేష్‌కుమార్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిద్దెల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో...

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంద్రానగర్‌కాలనీ ప్లే గ్రౌండ్, భాగ్యనగర్ కాలనీతో పాటు పలు కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కారు గుర్తుకు ఓటు వేయాలని చెబుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ.. మేనిఫెస్టో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు మద్దతుగా కార్యకర్తలు, నాయకులు, సీనియర్ నాయకులు మిద్దెల సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, శివారెడ్డి, కామసాని మహేందర్, కావలి శేఖర్, అర్జున్‌రెడ్డి, పీఎంరెడ్డి, సతీష్‌గుప్తా, శ్రీను, స్టార్ మల్లేష్, శివశంకర్ తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

బండ్లగూడ: కార్తీక పౌర్ణమి సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి రోజున దీపారాధన చేయడం వల్ల ఎన్నో శుభ ఫలితాలనిస్తాయని, యాగం చేసిన ఫలితం లభిస్తుందని భక్తుల విశ్వాసం. భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. కాళీమందిర్, బండ్లగూడ పాత గ్రామంలోని శివాలయం, హైదర్షాకోట్‌లోని విజయ గణపతి దేవాలయం ప్రశాంతినగర్‌లోని శివాలయం తదితర దేవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.

సామూహిక కుంకుమార్చన..

మణికొండ: కార్తీక పౌర్ణమి సందర్భంగా పలు దేవాలయాలలో భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పార్వతీరామలింగేశ్వరాలయం, పుప్పాల్‌గూడ కాశీ విశ్వేశ్వరాలయం, చంద్రమౌళీశ్వరాలయం, ఓయూ కాలనీ దుర్గామాత దేవాలయం, మైహోం అవతార్ సంకటహర హనుమాన్ దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, అభిషేకాలను నిర్వహించారు. కార్తీకమాసంలో శివుడు, విష్ణుమూర్తిలను పూజించి తమ కుటుంబాలను చల్లగా చూడాలని కోరుకుంటున్నారు. దేవాలయాల ఆవరణలో సాయంత్రం దీపాలను వెలిగించారు.



ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భక్తులు



ఓయూకాలనీ దుర్గామాత ఆలయంలో..

బీఆర్ఎస్‌వీకి మండల అధ్యక్షుడి రాజీనామా

శంషాబాద్ రూరల్ : బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు వై.మధుసూధన్ తన పదవితో పాటు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల, విద్యార్థుల భవిష్యత్తుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడికి లేఖను పంపినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు సకాలంలో అందడంలేదన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమడిందని మండిపడ్డారు.

జోరుగా 'హస్తం' ప్రచారం..

అత్తాపూర్: ప్రచార గడువు దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ ప్రచారం వేగం పెంచారు. అన్ని కాలనీల్లో పలు బృందాలు నరేందర్ తరపున ప్రచారం చేశారు. కాంగ్రెస్ హయంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేస్తూ.. అత్తాపూర్‌లో సోమవారం కలియతిరిగారు. కాలనీల్లోని ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ.. ఆయా కాలనీవాసులకు హమీలిస్తూ ప్రచారం కొనసాగించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు యువజన కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘం, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను విస్తృత్తంగా ప్రచారంలో వినియోగించారు. అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, బండారి రమేష్, రవీందర్, సుధాకర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, ఖలీద్, మహేందర్, వనం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కరపత్రాల పంపిణీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని మాణిక్యమ్మ కాలనీ, రాజేంద్రనగర్, గాంధీనగర్, నవజ్యోతి యూత్ క్లబ్, హనుమాన్‌నగర్, బుద్వేల్ టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీల కరపత్రాలను పంపిణీ చేస్తూ.. చేతి గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. పార్టీ సీనియర్ నాయకులు కోరని శ్యామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అందుకే ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారన్నారు.